క్లుప్తంగా

ఆగమోక్తంగా మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

వరి విత్తనాల తనిఖీ



విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని సీడ్స్ దుకాణాల్లో విక్రయిస్తున్న వరి విత్తనాలను సోమవారం ఏఓ భారతి తనిఖీ చేశారు. ఈ మేరకు ధరలు, రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి, కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

రూ.3లక్షలతో తాగునీటి బోరు



బోరు ప్రారంభించిన జెడ్పీటీసీ విజయలక్ష్మి

సత్యవేడు : స్థానిక గంగమ్మ గుడి ప్రాంతంలో రూ.3లక్షలు వెచ్చించి తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక నేత రమేష్‌తో కలిసి బోరును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గంగ మిట్ట వీధివాసుల దాహార్తిని తీర్చడంతోపాటు, గంగ జాతర సందర్భంగా నీటి ఎద్దడి తలెత్తకుండా బోరు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

శ్రీసిటీలో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామిక వాడలో సోమవారం పుత్తూరు ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) చంద్రశేఖర్ వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్, తరలించే సరుకులకు జీఎస్టీ వివరాలను పరిశీలించారు. ఈ మేరకు 43 కేసులు నమోదు చేసి రూ.4.39లక్షలు వరకు జరిమానాలు విధించారు. అలాగే వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు.

ముమ్మరంగా అపార్ నమోదు

విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరుతో విశిష్ట నంబర్‌ను కేటాయిస్తోంది. ఈ మేరకు విద్యాశాఖ పకడ్బందీగా వివరాలు సేకరిస్తోంది. పాఠశాలలు.. కళాశాలల్లో (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) అపార్ నమోదు చేయిస్తోంది. దీంతో దేశంలో ఎక్కడైనా పిల్లలు చదువుకునే వెసులుబాటు కలుగుతుందని ప్రకటించింది. త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది.

- వన్ నేషన్- వన్ స్టూడెంట్ పేరుతో ఐడీ కార్డులు
- డేటా సేకరిస్తున్న ఉపాధ్యాయులు
- పకడ్బందీగా కొనసాగుతున్న ప్రక్రియ



బుచ్చినాయుడుకండ్రిగ హైస్కూల్‌లో అపార్ వివరాలను అప్‌లోడ్ చేస్తున్న ఉపాధ్యాయులు



హైస్కూల్‌లోని విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేటు ఉన్నత పాఠశాలు, ఒక ఏకలవ్య గురుకులం, 54 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలున్నాయి. మూడు కళాశాలున్నాయి. 1వ తరగతి నుంచి ఇంటర్మీయట్ వరకు మొత్తం 5,129 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 2,759 మంది విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియ పూర్తి కాగా, 2,370 మందికి చేయవలసి ఉంది. ఈ మేరకు ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు బిజీగా ఉన్నారు.

సమస్త సమాచారం

జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించి కేజీ నుంచి పీజీ వరకు సమస్త సమాచారం నిక్షిప్తం చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులందరికీ ఈ నంబర్ కేటాయించనున్నారు. ప్రస్తుతం యూడైస్ ప్లస్ వెబ్ సైట్‌లో ప్రతి విద్యార్థికి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) కేటాయించారు. దీని ఆధారంగానే విద్యార్థులకు టీసీలు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇకపై అపార్ కార్డు నంబర్ ఉంటే దేశంలో ఎక్కడికైన వెళ్లి చదువుకునే అవకాశముంటుంది.

మార్పులకు అవకాశం ఉండదు

అపార్ కార్డు తీసుకునేందుకు విద్యార్థితోపాటు తల్లి లేదా తండ్రి సదరు విద్యాసంస్థలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకోసం మొదట యూడైస్ ప్లస్‌లో నమోదైన వివరాలు సరిచూసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనిని ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపల్ ధ్రువీకరించాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబర్ జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు వెలువడుతుంది. ఒక సారి వెలువడిన కార్డులో సవరణలకు అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. అందువలన అన్ని వివరాలు ముందే సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.



అనేక ఉపయోగాలు

అపార్ కార్డుతో విద్యార్థులకు అనేక ఉపయోగాలుంటాయని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నంబర్ అన్నీ కలిపి డిజిటల్ రూపంలో భద్ర పరచడం జరుగుతుంది. విద్యార్థి చదువుకు సంబంధించిన అకడమిక్ విద్యా వివరాలు నమోదవుతాయి. మార్కులు, గ్రేడ్‌లు, ఉపకార వేతనాలు, క్రీడల్లో సాధించిన అంశాలు, అందులో నిక్షిప్తమవుతాయి. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల వివరాల నమోదు ధ్రువీకరణ సులభంగా ఉంటుంది. విద్యార్థుల వివరాలన్నీ డిజిటల్ లాక్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుసంధానమై ఉండటంతో సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడం సులువుగా ఉంటుందని అధికారులు తెలిపారు.

55 శాతం పూర్తయింది



మండలంలో ఇప్పటి వరకు 55 శాతం విద్యార్థుల వివరాల నమోదు పూర్తయింది. మిగిలిన విద్యార్థుల వివరాలు కూడా సేకరించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అన్ని వివరాలు సేకరించిన తర్వాత అపార్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తాం.

\- రవీంద్రనాథ్, ఎంఈఓ, బీఎన్ కండ్రిగ

ముక్కంటి సేవలో రోజా



గురుదక్షిణామూర్తి సన్నిధిలో మాజీ మంత్రి రోజా

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం మాజీ మంత్రి రోజా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, ప్రసాద్, ఈశ్వర్‌సాయి, ముని తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో ఎస్పీ మణికంఠ



గుడిమల్లం దర్శించిన ఎస్పీ దంపతులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోల్, ఆయన సతీమణి రైల్వే డీఎస్పీ హర్షిత సందర్శించారు. కార్తీక సోమవారం సందర్భంగా స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. రాహుకాల అభిషేకంలో వారు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆహ్వానం పలికారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వామివారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు ఆశీర్వాదం చేశారు.

సకాలంలో రేషన్ పంపిణీకి ఆదేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : రేషన్ కార్డుదారులందరికీ సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 28 రేషన్ షాపులున్నాయని, 11 వేలకు పైగా కార్డుదారులున్నారని తెలిపారు. వీరందరికీబియ్యం, చక్కర, కందిపప్పు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికీ వెళ్లి సరుకులు అందించాలని స్పష్టం చేశారు. తూకంలో తేడాలు రాకుండా చూసుకోవాలని, వీఆర్‌ఓలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీటీ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న ప్రభాకర్

రేణిగుంట: కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి అమెరికాలోని టెక్సాస్ డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ రేణిగుంటకు చెందిన వంగపరపు ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సూర్యలోక్ కన్వెన్షన్ హాల్లో గాడ్ సన్ హోలీ స్పిరిట్ థిలాజికల్ అకాడమీ వారిచే జరిగిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రభాకర్ అందుకున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన అమెరికాలోని టెక్సాస్ నగరానికి చెందిన డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ వారు ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేసి ఘనంగా సత్కరించారు. విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్ జ్ఞాన వేణి కుంచె, ప్రముఖ హాస్య నటులు బాబు మోహన్, దొరస్వామిల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్చ్ బిషప్ డాక్టర్ ఎంవి ప్రసాద్, మిస్ యూనివర్స్ 2022 డాక్టర్ సజన, అబ్దుల్ రెహమాన్, హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ అభిషేక్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

8న ఏడు గంగమ్మల ఆలయ మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన ఏడుగంగమ్మల ఆలయానికి 8వ తేదీ శుక్రవారం మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 7వ తేదీ సాయంత్రం 6గంటలకు పూజా కార్యక్రమాలు 8వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల లోపు మహాకుంభాభిషేకం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

తూతూమంత్రంగా 'గ్రీవెన్స్'

సత్యవేడు : మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, అటవీశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తెలుగుగంగ, హౌసింగ్ అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో వివిధ సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చిన అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, ఎంఈఓలు కె.రవి, ఉషా, పీఆర్ ఏఈ ఇబ్రహీం ఖాన్, ఏపీఓ కృష్ణయ్య, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, సీడీపీఓ దేవకుమారి, ఏఈ మురళి తదితర అధికారులు మాత్రం హాజరయ్యారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి పురవిహారం



ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: కార్తీకమాసం పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబ దేవి సోమవారం పురవిహారం చేశారు. ఆలయంలోని అలంకారమండపంలో ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను చప్పరాలపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నారద పుష్కరిణిలో కార్తీక మాసం పురస్కరించుకుని కార్తీకదీపాలను వెలిగించారు. దీంతో ఆ ప్రాంతంలో కార్తీక శోభ సంతరించుకుంది.

దళిత, గిరిజన భూములను రక్షించండి



ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ రైతు సంఘం నాయకులు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని దళిత, గిరిజన భూములను కొంతమంది మాయమాటలు చెప్పి వారికి కొంత సొమ్ము ముట్టజెప్పి కొనుగోలు చేసి వాటిని ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారని అలాంటి భూములను అమ్మకుండా చూడాలని సీపీఎం వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కోరారు. వారు సోమవారం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజ్, జిలా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రామాపురం, ఇతర గ్రామాల్లో నివాసం ఉన్న దళిత గిరిజన భూములను గుర్తించి కొంతమంది గ్రూపులుగా ఏర్పడి నిరుపేదలు సాగు చేస్తున్న భూములకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు కొనుగోలు చేసి వాటిని తిరిగి భూబకాసురులకు అధిక ధరలకు అమ్ముతున్నారని చెప్పారు. ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి భూములిస్తే, వాటిని దళిత, గిరిజన కుటుంబాలు సాగు చేసుకుని జీవిస్తున్నాయని పేర్కొన్నారు. వాటిని ప్రైవేటు వ్యక్తులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం సరికాదన్నారు. అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్డీవో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, మణి, వినాయక, రత్నమ్మ నాగేశ్వరి, లతమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం కోసం వినతి



గ్రామకార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ : రైతులకు అన్నదాతా సుఖీభవ కింద రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు కోరారు. సోమవారం ఈ మేరకు వీఎస్‌పురం గ్రామ కార్యదర్శి రజనీకాంత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా పథకం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై సుమారు రూ. 2.45లక్షల రుణం ఉందని వెల్లడించారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఆటకెక్కిందని ఆరోపించారు. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సాగునీటి రంగం అభివృద్ధికి భారీగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. చెరువులకు మరమ్మతులు చేయడం లేదని, యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు కత్తిరవి, ప్రవీణ్‌కుమార్, నేతలు కృష్ణయ్య, భాస్కర్, వెంకటకృష్ణయ్య, చొక్కలింగం పాల్గొన్నారు.

కార్తీక శోభ

కార్తీక మాసం.. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రం.. భక్తకోటికి ముక్తిమార్గం.. లోకంలో చీకటిని పారదోలి వెలుగులు నింపే జ్యోతి స్వరూపం.. లయకారుని ప్రసన్నం చేసుకునే నియమ నిష్టల సమాహారం.. పుణ్యస్నానాలతో పునీతులయ్యేందుకు జనులకు మహిమాన్వితం అవకాశం. ఈ క్రమంలో పరమ శ్రేష్టమైన కార్తీక సోమవారం సందర్భంగా శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. దీపారాధనలతో మహిళలు పులకించారు. శ్రీకాళహస్తిలోని నారదపుష్కరిణిలో దీపోత్సవం వైభవంగా నిర్వహించారు.

\- శ్రీకాళహస్తి





తిరుపతి కపిలతీర్థంలో కిక్కిరిసిపోయిన భక్తులు(ఇన్‌సెట్) కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శ్రీకాళహస్తి: నారద పుష్కరిణి మెట్లపై భక్తులు వెలిగించిన దీపాలు



తిరుపతి కపిలతీర్థంలో దీపారాధన చేస్తున్న భక్తురాలు



శ్రీకాళహస్తి: దీపోత్సవంలో ఆలయ అర్చకులు